క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను సిబ్బంది సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన బెండ, వంగ, మునగ, ఆకుకూరలు, క్యారెట్లను కార్యాలయానికి వచ్చిన ప్రజలకు విక్రయించి అవగాహన కల్పించారు. పురుగు మందులు వాడని ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగాలను దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసన్న, గూడూరు, ఓజిలి మండల ఇన్‌చార్జిలు వీరరాఘవయ్య, జైతున్‌బీ, సిబ్బంది రాజేష్, చంచమ్మ, మహేశ్వరి, షబానా, శ్రావణి, సాయిప్రియ పాల్గొన్నారు.

పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన


వైష్ణవి డెయిరీ ఎదుట కార్మికుల ఆందోళన

పెళ్లకూరు : నోటీసులు ఇవ్వకుండానే యాజమాన్యం కంపెనీని మూసేయడంతో తాము వీధిన పడ్డామని పలువురు కార్మికులు వాపోయారు. వారు సోమవరం వైష్ణవి డెయిరీ ముందు ఆందోళనకు దిగారు. పునబాక గ్రామంలోని వైష్ణవి డెయిరీలో కొంత కాలంగా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఈ తరుణంలో కంపెనీ ప్రతినిధులు కొన్ని రోజులుగా ఉత్పత్తులను నిలిపేశారు. కార్మికులకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించలేదు. మూడు రోజులుగా కంపెనీ ప్రతినిధులు పరిశ్రమకు రావడం లేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తోంది. దీంతో కార్మికులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. బకాయిలు చెల్లించడంతోపాటు కంపెనీలో తిరిగి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పెళ్లకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కార్మికులు కృష్ణయ్య, మోహన్, దుర్గాప్రసాద్, హరి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఆవరణలో వర్షపు నీరు



కోట : గృహ నిర్మాణశాఖ కార్యాలయానికి దారి లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో హౌసింగ్ కార్యాలయం ఉంది. చుట్టూ ముళ్లపొదలు పెరిగాయి. దీనికితోడు నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి కార్యాలయం చుట్టూ నీరు చేరింది. బయటికి వెళ్లే మార్గం లేకపోవడంతో నీరు అక్కడే నిలిచి ఉంది. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైదాపురం ఎంపీడీవోకు గాయాలు


గూడూరు రూరల్ : బైక్ బోల్తాపడడంతో సైదాపురం ఎంపీడీవో శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. సైదాపురం ఎంపీడీవో గూడూరులో నివాసం ఉంటున్నారు. ఆయన సోమవారం విధుల్లో పాల్గొనేందుకు బైక్‌లో సైదాపురం బయలుదేరారు. గూడూరు రూరల్ ప్రాంతంలోని తిప్పవరప్పాడు సమీపంలో బైక్ బోల్తా పడింది. స్వల్ప గాయాలు కావడంతో బస్సులో గూడూరు వచ్చి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. దీనిపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

రవాణాకు సిద్ధంగా ఉన్న ఖనిజ సంపద



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం నడిబొడ్డులో ఆస్పత్రి వెనుక ప్రాంతంలో నిల్వ ఉంచిన ఖనిజాన్ని అక్రమార్కులు తరలించేందుకు సిద్ధం చేశారు. దాని విలువ రూ.లక్షలు ఉంటుంది. లారీల్లో తరలించేందుకు అనుకూలంగా బ్యాగుల్లో చేర్చారు. అక్కడే ఖనిజాన్ని గ్రేడింగ్ పనులు కూడా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వడ్డిపాళెంలో తాగునీటి సమస్య


ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం గ్రామంలో తాగునీరు సరఫరా చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటారు మరమ్మతులకు గురైంది. మూడు రోజులైనా దానికి మరమ్మతులు చేయలేదు. దీంతో తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆగిన సేవలు

పోలిరెడ్డిపాళెం గ్రామ పరిధిలోని గ్రామ సచివాలయం



నెలబల్లి గ్రామ పరిధిలో ఒకే ప్రాంగణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు



- సచివాలయాల్లో తీవ్ర సిబ్బంది కొరత
- అందుబాటులో లేని పలు శాఖల సిబ్బంది
- సకాలంలో అందని సర్టిఫికెట్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

ప్రజలకు స్థానికంగానే సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. 2 వేల ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేసింది. 11 శాఖలకు సంబందించిన సిబ్బందిని నియమించింది. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా స్థానికంగానే సేవలు అందించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాలను నిర్లక్ష్యం చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కోపంతో సిబ్బందిపై కక్ష సాధింపులకు దిగింది. వారిని ఇతర పనులకు వినియోగిస్తుండడంతో సచివాలయాల్లో సేవలు అందడం లేదు. దీనికితోడు సిబ్బంది కొరత పట్టిపీడిస్తుండడంతో గ్రామాల్లోని రైతులు, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందని ద్రాక్షలా మారాయి.

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలంలో 22 పంచాయతీలకు గాను 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 65 గ్రామాల్లో 39,500 మంది జనాభా ఉన్నారు. ప్రతి సచివాలయంలో 11 శాఖలకు చెందిన 121 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 67 మంది మాత్రమే ఉన్నారు. 22 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండాల్సి ఉండగా 17 మంది మాత్రమే ఉన్నారు. అదే విధంగా 11 గ్రామ సచివాలయాల్లో 11 శాఖలకు చెందిన సిబ్బంది తప్పని సరిగా ఉండాలి. తాజాగా బదిలీలు చేపట్టడంతో కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు 8 మంది, మహిళా పోలీసులు 10 మంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు 9 మంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఏడుగురు, ఉద్యాన వన శాఖ సిబ్బంది ఒకరు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ముగ్గురు, విలేజ్ సర్వేయర్లు ఆరుగురు, వీఆర్వోలు నలుగురు, వెటర్నరీ అసిస్టెంట్లు 10 మంది, ఏఎన్ఎంలు 10 మంది మాత్రమే ఉన్నారు. సెరికల్చర్, మత్స్య శాఖల సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో రైతులు, ప్రజలకు సేవలు అందడం లేదు. 2019కి ముందు లాగానే మళ్లీ మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

సిబ్బంది కొరత ఉన్న సచివాలయాలు ఇవే..

మండలంలోని ఏకొల్లు, తల్లంపాడు, మీజూరు గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. పంచాయతీ కార్యదర్శుల పోస్టులు భర్తీ కాలేదు. దీంతో ఒకరిద్దరి సిబ్బందిని ఇన్‌చార్జిలుగా నియమించి పాలనను కష్టం మీద కొనసాగిస్తున్నారు.

పది సేవలు కూడా అందని వైనం...

గత ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా 536 సేవలను అందించింది. ప్రస్తుతం పట్టుమని పది సేవలు కూడా అందడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ పని కోసం వెళ్లినా ఆయా శాఖల సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఒకటికి పదిసార్లు తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీంతో మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోందని చెబుతున్నారు. మరి కొన్ని సేవలను మీసేవా కేంద్రాల్లో రూ.వందలు వెచ్చించాల్సిన దుస్థితి నెలకొందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు లేనందున కులం, ఆదాయం, 1బీ, అడంగల్, టైటిల్ డీడ్ తదితర కీలమైన రెవెన్యూ సేవలు అందడం లేదు.

సేవలు అందడంలేదు



గ్రామ సచివాలయంలో గతంలో మాదిరి ఇప్పుడు సేవలు అందడంలేదు. కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం సచివాలయంకి వెళ్లినా సిబ్బంది ఉండడం లేదు. దీంతో చేసేది లేక మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ వీఆర్వో ఉంటే ఆర్ఐ ఉండరు. వీరిద్దరూ ఉంటే తహసీల్దార్ ఉండరు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు అని అవుతుందో తెలియక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– ఎం.మునస్వామి, వేటగిరిపాళెం

మళ్లీ తిరగాల్సి వస్తోంది



ఏ పని కోసమైనా సచివాలయం చుట్టూ పదిసార్లు తిరగాల్సి వస్తోంది. గతంలో గ్రామ వలంటీర్లు ఏది కావాలన్నా చేసి పెట్టేవారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులను వారే తీసుకెళ్లి ఇంటి వద్దకే తీసుకువచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లినా సరైన సమాచారం ఇచ్చేవారు లేరు. గట్టిగా అడిగితే సంబంధిత సిబ్బంది లేరని చెబుతున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

– టి.భారతి, మీజూరు

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాము



గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. అన్ని సచివాలయాల్లోనూ ప్రతి శాఖకూ సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపడతాము. ప్రస్తుతం 11 గ్రామ సచివాలయాల్లో 121 మందికి గాను 80 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. మిగిలిన పోస్టులనూ భర్తీ చేస్తాం. ప్రజలకు అన్ని సేవలూ అందేలా చర్యలు తీసుకుంటాము.

– కె.గోవర్ధన, ఎంపీడీవో, దొరవారిసత్రం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న పరిశీలకులు ప్రసాద్



డక్కిలి: మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

గూడూరు రూరల్/చిల్లకూరు/ఓజిలి/డక్కిలి : పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గూడూరు, చిల్లకూరు, ఓజిలి, డక్కిలి ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర పరిశీలకులు రమేష్ మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు అన్ని అవకాశాలనూ వినియోగించుకోవాలన్నారు. పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, విద్యుత్, తాగునీటి సౌకర్యం, పాదుపు, ఐసీడీఎస్ అధికారులకు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవోలు మధుసూదన్‌రావు, గోపి, విజయలక్ష్మి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఈవోపీఆర్డీలు మోహన్, సిరాజ్, రేణుక, అల్లాబక్షు, ఎంఈవోలు శైలజ, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిల్లకూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపిందని సీపీఎం నాయకులు విమర్శించారు. వారు సోమవారం సీఐటీయూ, ప్రజా సంఘాల నేతలతో కలిసి గూడూరు లోని టవర్ క్లాక్ వద్దనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దీనికితోడు విద్యుత్ చార్జీలు పెంచారని, ఇవి చాలదన్నట్టు స్మార్ట్ మీటర్లు పెట్టి పేదల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఇప్పటికే పెంచిన చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు జోగి శివకుమార్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, శంకరయ్య, ప్రసాద్, రమణయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఇరువర్గాల రైతుల ఘర్షణ


ట్రాక్టర్‌తో వరి పంటను దున్నేస్తున్న ఒక వర్గం వారు

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం బురదగాలికొత్తపాళెం పంచాయతీ కుమ్మరపాళెంలో సోమవారం ఇరువర్గాల రైతుల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసుల కథనం మేరకు.. గతంలో ఎనిమిది మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు గ్రామంలోని సర్వే నంబర్ 16లో 24 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. వారు అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది వరిపంట సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఈ క్రమంలో మరొక వర్గానికి చెందిన రైతులు పంటను ట్రాక్టర్ దున్నేందుకు ప్రయత్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. రెండు వర్గాల వారు అధికార పార్టీకి చెందిన వారు కావడం విశేషం.

సమస్యల పరిష్కారమే సదస్సుల లక్ష్యం


పెళ్లకూరు : అర్జీలు అందజేస్తున్న రైతులు


నాయుడుపేట టౌన్ : అర్జీలు ఇస్తున్న ప్రజలు

సైదాపురం: భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. సైదాపురం పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ వెందోటి శారద అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో హజరత్తయ్య పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని కర్రబల్లవోలులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై 12 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో దిలీప్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు వెందోటి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత యల్లా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : మండలంలోని మోదుగులపాళెంలో నిరుపేదలకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల పూర్తి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సోమవారం మోదుగులపాళెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని బీటీరోడ్డును దళితకాలనీ వరకు వేయాలని పలువురు గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, ఆర్ఐ సంతోషినీబాయి, వీఆర్వో వంశీ, వీఆర్ఏలు మోహన్, కృష్ణ నాయకులు వెంకటసుబ్బయ్య, గురవయ్య పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని కల్లూరుకండ్రిగ, సూరగుంటతాగేలి గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు 1బీ, అడంగళ్లలో పేర్ల మార్పు, చేర్పులు, సర్వే సమస్యలపై అర్జీలు ఇచ్చినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. మండల సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలోని తుమ్మూరు వార్డు సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 30 అర్జీలు వచ్చినట్టు మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ సర్వేయర్ హరోహర తెలిపారు. వాటిలో ఇళ్ల స్థలాల కోసం 22, పట్టాదారు పాసు పుస్తకాలు, భూ సమస్యలపై 10 అర్జీలు ఉన్నట్టు ఆర్ఐ సాయితేజ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ రాజేంద్ర తెలిపారు. ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

నాయుడుపేట టౌన్/దొరవారిసత్రం : నాయుడుపేట, దొరవారిసత్రం ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళ, బుధవారాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవోలు సురేష్‌బాబు, గోవర్ధన తెలిపారు. పేదరికాన్ని రూపు మాపడం, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

రోడ్డు ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య

కోట : మండల కేంద్రమైన కోటలోని ముస్లిం వీధిలో రోడ్డును ఆక్రమించుకోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోందని స్థానికులు వాపోయారు. వారు సోమవారం ఆక్రమణలు తొలగించాలని ఎంపీడీవో వేణుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దుకాణదారులు రోడ్డుపై నిర్మాణాలు చేపట్టడంలో వాహనాలు వెళ్లే దారి కూడా లేకుండా పోయిందన్నారు. ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేయాలన్నారు. స్పందించిన ఎంపీడీవో స్థానికుల ఫిర్యాదును పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను ఆదేశించారు.

సురక్షిత ప్రసవాలపై దృష్టిసారించాలి

వెంకటగిరి రూరల్ : ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణులకు సురక్షితంగా ప్రసవాలు చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని డీపీఎంవో శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం బంగారుపేట పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకునేలా తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి ఆస్పత్రుల్లో కాన్పు చేసుకునేలా చూడాలన్నారు. డీపీవో ప్రకాష్, యూపీహెచ్‌సీ చెవిరెడ్డిపల్లి వైద్యులు రవితేజ, పాతకోట పీహెచ్‌సీ వైద్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి(సైదాపురం) : ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, తన వార్డులోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కండలేరులో 56.568 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 56.568 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరులోకి వరద కాలువ ద్వారా 750 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 550, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సాగరమాల పనుల అడ్డగింత

చిల్లకూరు : మండలంలోని తీరప్రాంతమైన లింగవరం పంచాయతీ నర్రావారిపాళెం సమీపంలో జరుగుతున్న సాగరమాల రోడ్డు పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. అనేక ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను ఖాళీ చేయాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తుండడంతో బాధితులు ససేమిరా అని పనులు అడ్డుకుని నిరసన తెలిపారు. కాంట్రాక్టర్లు మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్డీవో కార్యాలయం డీటీ రఫీ, వీఆర్వో బాలాజీ అక్కడికి చేరుకుని స్థానికులతో చర్చించారు. వారికి పరిహారం అందించేలా చర్యలు చేపట్టారు. గిరిజనుల నాలుగు పూరి గుడిసెలకు రూ.5 వేల చొప్పున పరిహారం ఇస్తామని కాంట్రాక్టర్లు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక గుడిసె వేసుకోవాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు అవుతుందని, రూ.5 వేలు ఇస్తామని చెప్పడం సమంజసం కాదని స్థానికులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గూడూరు రూరల్ : ఆర్టీసీ గూడూరు డిపోలో మేనేజర్ తమపై కక్ష సాధింపులకు దిగుతూ అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని కార్మికులు వాపోయారు. వారు సోమవారం గూడూరు ఆర్టీసీ డిపోలోని ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ నాయకులతో కలిసి సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మిక సంఘంలోని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతరులపై పనిభారం మోపుతున్నారని తెలిపారు. వారికి ఏదైనా సమస్య వస్తే దానిని సాకుగా చూపి సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. న్యాయం చేయాలని వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా కనీసం చర్చలు కూడా జరపలేదని వాపోయారు. డిపోలో జరుగుతున్న అన్యాయాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాము, మన్యం, శ్రీధర్, శేషయ్య, వెన్నెల, రమణయ్య, క్రిష్ణయ్య, భాస్కర్, రామయ్య, శివకుమార్, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రవహిస్తున్న కలుజు


కలుజు పారుతున్న చీకవోలు చెరువు

సైదాపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చీకవోలు గ్రామంలోని పెద్ద చెరువు పూర్తిగా నిండింది. కలుజు జోరుగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాగునీటికి ఇబ్బంది ఉండదని, పంటలు పండించుకోవచ్చని చెబుతున్నారు.

రామనాథేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



రాపూరు: రాపూరులో శివాలయంలో వెలసిన రామనాథేశ్వర స్వామికి సోమవారం మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. మూలమూర్తికి తెల్లవారు జామున గోరు వెచ్చని వేడి నీటితో అభిషేకం, అనంతరం ప్రత్యేక సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అర్చకుడు రాము మాట్లాడుతూ ఏడాదికొకసారి మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి గోరువెచ్చని నీటితో అభిషేకం చేయడం ఆనవాయితీ అన్నారు. ఈ అభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

తాళ్లమ్మకు సామూహిక పొంగళ్లు

డక్కిలి : మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మకు గ్రామస్తులు సోమవారం సామూహిక పొంగళ్లు పెట్టారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామస్తులు ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు


పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న సంఘం నాయకులు

చిల్లకూరు : గూడూరు రెండో పట్టణంలోని చింపిరి కాలువ కట్ట ప్రాంతంలో ఉన్న గ్రేస్ ప్రేయర్ హాల్‌లో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాస్పెల్ మినిస్ట్రీస్ ట్రస్టు వ్యవస్థాపకులు కె.జాన్సన్ క్రీస్తు పుట్టుకకు సంబందించిన దైవ సందేశాన్ని అందించారు. అనంతరం పలు సంఘాలకు చెందిన పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. తదుపరి యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.కుమార్, ప్రధాన కార్యదర్శిగా జె.కిషోర్‌కుమార్, కోశాధికారి యాకోబ్, గౌరవ అధ్యక్షులుగా మోహన్‌రావు, ఆర్.బాబు, ప్రసాద్, భరత్‌బాబు, స్టీఫెన్ పాల్‌సన్, విజయపాల్, షాలెంరాజ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ఆనంద్‌పాల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

20న చెరువులకు వేలం పాటలు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అమ్మవారిపేట, కుమ్మరగుంట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం, పెరియవరం, మరాటపల్లి, పోలిశెట్టిగుంట, మనులాలపేట చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు ఈ నెల 20న మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీధర్ తెలిపారు. అదేవిధంగా బందిలదొడ్డి వీధిలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 13 గదులను నెలసరి అద్దెకు ఇచ్చేందుకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

25న ద్విచక్ర వాహనం వేలం

వెంకటగిరి రూరల్ : మద్యం కేసులో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనానికి ఈ నెల 25న వేలం వేయనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం పాటలు నిర్వహిస్తామని వెల్లడించారు.